## ఎల్లమ్మ దేవస్థాన భూమిని పరిరక్షించాలని ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేత



**ఆమనగల్లు,జులై06(నేటి దర్శిని);**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నవ చైతన్య కాలనీ లోని సందబాయి సమీపంలో గ్రామ కంట భూమిలో తరాలుగా దళిత కుటుంబాలు రేణుక ఎల్లమ్మ తల్లిని ఆరాధిస్తున్నామని, ఆ దేవస్థాన భూమిని కొందరు భూకబ్జాదారులు అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ కాలనీవాసులు సోమవారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. కొల్లూరు కృష్ణాదేవి ఉద్దేశపూర్వకంగా 12 మంది దళిత కుటుంబాలపై అక్రమ కేసులు నమోదు చేయించి ఏడాదికాలంగా వేధింపులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లమ్మ దేవస్థానం భూమిని కబ్జా కాకుండా పరిరక్షించి,బాధిత దళిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వస్పుల జంగయ్య, శ్రీశైలం,జానయ్య,శంకర్ ,బలరాం,రాజు,అశోక్, కృష్ణ,చిన్న,రాజు,శివ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జెండా పేదలకు కొండంత అండ

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు,జులై06(నేటి దర్శిని):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తోడ్పాటుతో పేదలు కష్టాల నుంచి వైదొలగి ఆత్మగౌరవంతో బతుకుతున్నారని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.కాంగ్రెస్ జెండా పేదలకు కొండంత అండ అని కసిరెడ్డి అన్నారు. మాడ్గుల,వెల్దండ, తలకొండపల్లి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి వివిధ పథకాల కింద చేపడుతున్న పనులను పరిశీలించి నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు.అనంతరం నాగర్ కర్నూల్,రంగారెడ్డి జిల్లాలకు చెందిన విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యుత్ సమస్యల పరిష్కారం, ప్రజలకు సంబంధించిన అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ఎలాంటి పెండింగ్ పనులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా ప్రజాదర్బార్ ద్వారా ఆయా మండలాల నుంచి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్,గూడూరు శ్రీనివాస్ రెడ్డి యాట నరసింహ,అజీజ్, విద్యుత్ శాఖ ఏడిఈ,ఏ ఈ, ఆయా మండలాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

● మిడ్జిల్ జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం







**మిడ్జిల్ జూలై 06,( నేటి దర్శిని ప్రతినిధి ):**
జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మిడ్జిల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనుప శివరాజ్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోసిస్ వ్యాధులుగా పేర్కొంటారని తెలిపారు. ఈ వ్యాధులు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. కుక్క కాటు, అనారోగ్య జంతువులతో సన్నిహిత సంబంధం, పరిశుభ్రత లోపించడం వంటి కారణాలతో జూనోసిస్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని చెప్పారు.రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్షయవ్యాధి, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, లెప్టోస్పైరోసిస్ వంటి ప్రధాన జూనోసిస్ వ్యాధుల గురించి విద్యార్థులకు వివరించి, వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం, శుభ్రమైన నీటిని తాగడం, మాంసం, గుడ్లను పూర్తిగా ఉడికించి తీసుకోవడం, పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, గోశాలలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అనారోగ్యంతో ఉన్న జంతువులకు వెంటనే చికిత్స అందించడం ద్వారా జూనోసిస్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ అధ్యాపకులు శ్రీనివాస్, గణేష్, పశు వైద్యశాఖ సిబ్బంది సత్యం, శ్రీనివాస్, గోపాలమిత్రలు వేణుగోపాలచారి, రామకృష్ణ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు అండగా సాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి..

● మారేపల్లి గ్రామంలో మృతుల కుటుంబాలకు సానుభూతి, భరోసా
● అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి ఆరోగ్యంపై అధికారులతో చర్చ
● గ్రామ సమస్యలపై సర్పంచ్‌తో ఎమ్మెల్యే సమీక్ష

**అనుముల, జూలై 6 (నేటి దర్శిని):**
నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి సోమవారం అనుముల మండలం మారేపల్లి గ్రామంలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ సర్పంచ్ వడ్డగోని సరస్వతి-లక్ష్మయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.కే. సైదా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ శాఖ గౌరవ అధ్యక్షుడు మెండే ఏడుకొండలు తల్లి మారెమ్మ మృతికి ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గండు వెంకటేశం కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మహంకాళి హిందూ కుటుంబాన్ని కూడా సందర్శించిన ఎమ్మెల్యే, ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఎలాంటి ఆపద వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన 12 ఏళ్ల ఎస్.కే. ఉమేరా తబస్సుం రక్తహీనత (ఎనీమియా)తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని, ఆమె ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన సమస్యలపై గ్రామ సర్పంచ్‌తో ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి చర్చించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజార్ మొహిద్దిన్, సీనియర్ నాయకులు నకిరేకంటి సైదులు, కౌన్సిలర్ ముత్యాలు, ఉపసర్పంచ్ గండికోట సతీష్, మాజీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అనుముల వినయ్ కుమార్, వార్డు సభ్యులు సైదులు బరపటి, నక్క నాగయ్య, గండు యాదయ్య, గండు శంకర్‌తో పాటు గ్రామ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

● తీదేడు గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అవగాహన
● గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి



**చింతపల్లి, జూలై 6 (నేటి దర్శనీ):**
చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతోందని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర తప్పుల సరిదిద్దడం, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో ప్రజలు ముందుకు వచ్చి సహకరించాలని సూచించారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఉలుపాల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఓ సిమర్ల శ్రీను యాదవ్, జూనియర్ అసిస్టెంట్ రజిత, గ్రామ పాలన అధికారి యాదయ్య, రికార్డు అసిస్టెంట్ వెంకన్న, బీఎల్ఓలు చింతకుంట్ల అంజమ్మ, గంటెల చంద్రయ్యతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## "నేను సైతం 2.0"లో భాగంగా నాగోల్‌లో 54 సీసీటీవీ కెమెరాల ప్రారంభం






● ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యం: ఎల్‌బీ నగర్ ఏసీపీకృష్ణయ్య

**నాగోల్; జూలై 6 (నేటి దర్శిని):**
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నివారణ, నేరాల పరిశోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కీలకమని ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య పేర్కొన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపడుతున్న "నేను సైతం 2.0" కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన 54 సీసీటీవీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణతో పాటు నేరస్థుల గుర్తింపు, నేరాల దర్యాప్తులో కీలక ఆధారాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ నివాస ప్రాంతాల్లో నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని అన్నారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, వాణిజ్య సముదాయం సీసీటీవీ నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసి సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీలోని నాలుగు బ్లాకుల నివాసితులు తమ సొంత నిధులతో 54 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పోలీసులకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఏసీపీ కృష్ణయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐ శివ నాగ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ దేవిడి వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ ఇన్‌చార్జిలు రిజ్వాన్, భాస్కర్, దేవేందర్, మొహమ్మద్ ఖాతీజా బేగం తదితరులు పాల్గొన్నారు.

